క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: గంధంగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని హిమాయత్‌సాగర్ ఏఈ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు.. కాళీ మందిర్, సంజయ్ గాంధీనగర్, ఇండస్ వ్యాలీ, గంధంగూడ, లిప్‌డమ్ విల్లాస్, సంఘం సిటీ బైరాగిగూడ, కేంద్రీయ విహార్, శివసాయినగర్, హిమగిరి కాలనీ, వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశాంత్‌నగర్, బృందావన్ కాలనీ, నర్సారెడ్డి కాలనీ, పద్మశ్రీ హిల్స్, పవనీ ఆర్మోనీ, పావని పెటల్స్, తిరుమల గార్డెన్, బండ్లగూడ, కె.కె కన్వెన్షన్, రాధా నగర్, రఘురామ్‌నగర్, కె.కె-1,2, ఫీల్‌గుడ్ హోమ్స్, సాయి బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు.

స్నేహితహిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలో..

స్నేహిత హిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కోత ఉంటుందన్నారు. మైఖేల్ కాలనీ, వినాయక్‌నగర్, డిడి కాలనీ, కాళీమందిర్, ఎన్‌ఎఫ్‌సీ కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయనగర్, అరుణోదయ నగర్, సంధ్యానగర్, జీఆర్‌నగర్, మాచన్‌పల్లి ఎన్‌క్లేవ్, జేఎస్ఎన్‌యూఆర్ఎం(పీరంచెరువు), జేఎన్ఎన్‌యూఆర్ఎం(గంధంగూడ), ద్వారకా నగర్, బాలాజీనగర్, ప్రశాంత్‌నగర్, పీరం చెరువు, వాసంతీ ఆనంది అపార్ట్‌మెంట్స్, గిరిధారి అపార్ట్‌మెంట్స్, ఎంపైర్ డెల్టా, పిఅండ్‌టి కాలనీ-ఏ,బీ,సీ,డీ, స్పెషల్ బ్లాక్, కీర్తి రిచ్‌మండ్ విల్లాస్, విద్యానగర్, వీకర్ సెక్షన్ కాలనీ, సుబ్రహ్మణ్య కాలనీ, శివపురి తదితర ప్రాంతాల్లో విద్యుత్ కోతలు ఉంటాయన్నారు. వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

పీఆర్‌సీ అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని విద్యుత్ ఉద్యోగులు నినదించారు. తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్సీ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాజులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్, సాయిబాబు, సహాయ కార్యదర్శి దేవేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీపీ మధుకర్ స్వామి, విద్యాభూషణ్ తదితరులు

అబిడ్స్: పేద బడుగు వర్గాల కోసం ఉచితంగా ప్లాస్టిక్ సర్జరీలు చేయిస్తామని డీసీపీ మధుకర్ స్వామి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ విద్యాభూషణ్ తెలిపారు. జనవరి 23 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు అమెరికన్ డాక్టర్లచే ప్లాస్టిక్ సర్జరీలు ఉచితంగా నిర్వహిస్తామని వారు వివరించారు. మంగళవారం సీతారామ్‌బాగ్‌లోని ఈశ్వర్ చంద్ర హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనవరి 18వ తేదీ నుంచి ప్లాస్టిక్ సర్జరీల కోసం రిజిస్ట్రేషన్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అమెరికాలో పేరుగాంచిన వైద్యులు డాక్టర్ సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భవాని ప్రసాద్‌చే ఈ మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్ జరుగుతుందన్నారు. లక్ష్మీకుమారి, కమల్‌కుమార్, రఘునాథ్‌రెడ్డి, విహారి తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో నిత్యం శానిటైజేషన్

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో ప్రధాన విభాగాలను ప్రతినిత్యం శానిటైజేషన్ చేస్తున్నామని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా అన్నారు. మంగళవారం ఆయన గోల్కొండ ఏరియా ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో జరుగుతున్న శానిటైజ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో జరిగే ఆపరేషన్లను చాలా జాగ్రత్తగా చేస్తామన్నారు. ఆపరేషన్ కంటే ముందు వైద్య పరికరాలను పూర్తిగా శానిటైజ్ చేస్తామని ఆయన అన్నారు. అంతేకాకుండా ఆస్పత్రి లేబర్ రూం కూడా పూర్తిగా శానిటైజ్ చేస్తామని తెలిపారు. డాక్టర్లు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ ఖాజా రఫూఫుద్దీన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్య ఎస్. నాయర్, థియేటర్ ఇన్‌చార్జి డాక్టర్ అమీర్, డాక్టర్ కవిత, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సంక్రాంతి సంబురాలు









శిల్పారామంలో సంక్రాంతి సంబురాలు మంగళవారం ముగిశాయి. గంగిరెద్దుల విన్యాసాలు, పిట్టలదొర, జంగమదేవరల మాటల గారడీ సందర్శకులను అలరించాయి. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భరత నాట్యాలయ గురువు చిత్ర నారాయణ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన అలరించింది. ఇందులో స్వరాంజలి, గణేశ పంచరత్న, శ్లోకాలు, అమ్మవర్ణం ,తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు లక్ష్మిశరణ్య, ఆశ్రిత, ఆర్ని, సుమేధ, శ్రీయ, విష్ణుప్రియ, సంజన, హన్సిక, వర్షిణీలు పాల్గొన్నారు. –మాదాపూర్

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత



బాధితులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ : పేద, మధ్యతరగతి వర్గాలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని కొత్వాల్‌గూడకు చెందిన బాధితులు జానయ్య, గోపమ్మ, బిక్షపతిలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం కౌన్సిలర్ లక్ష్మీతో కలిసి అందజేశారు. నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు పి. శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ ముదిరాజ్, నవీన్‌కుమార్, రాజేష్, రాజు, పూర్ణచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలంతా ఉపయోగించుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి, కార్పొరేషన్ అధికారులు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ 2వ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని 19వ తేదీన 1వ డివిజన్, 19వ డివిజన్‌లలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాకథాన్ విజేతలకు అభినందన



విద్యార్థులను అభినందించిన సీబీఐటీ ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి తదితరులు

మణికొండ: ఇన్వెస్కో హాక్ 2హైర్- 2023 హ్యాకథాన్ పోటీలో మొదటి బహుమతి సాధించిన విద్యార్థులను చైతన్యభారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి మంగళవారం అభినందించారు. కళాశాలలో కెమికల్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు యోగేష్, యష్‌రాజ్, మెకానికల్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు హిమాన్షు, సాయి వంశీ, ఐటీ ఫైనల్ ఇయర్ విద్యార్థి సాత్విక్‌లు హాకథాన్‌లో పాల్గొన్నారు. బ్లూప్రింట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిజైన్ సమస్యను పరిష్కరించారు. రూ. 50వేల నగదు బహుమతి గెలుచుకున్నారు. ఈ మేరకు వారిని ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో సీబీఐటీ కెరీర్, ప్లేస్‌మెంట్ సలహాదారుడు డాక్టర్ ఎస్ఎల్ఎన్ రెడ్డి, ప్రొఫెసర్ ఎం. ముకుంద వాణి, అధ్యాపకులు డాక్టర్ ఎం. మల్లయ్య, పీవీఆర్ రవీందర్‌రెడ్డి, కె.రాధిక, పి.శ్రీనివాస్‌శర్మ, డాక్టర్ సోల్‌మన్‌రాజ్, డాక్టర్ ప్రతిమ, డాక్టర్ జీఎస్ఎల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

అబిడ్స్: క్రీడాకారుల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. బాక్సింగ్ చాంపియన్ మహ్మద్ ముస్సాముద్దీన్‌ను హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు, సేవారత్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో నగదు, మెమొంటోను అందజేసి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హోంమంత్రి ముస్సాముద్దీన్‌ను సత్కరించి అభినందించారు. క్రీడాకారులకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. సేవారత్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ.. తాను ఉద్యోగులతో పాటు క్రీడాకారుల సంక్షేమానికి కూడా అండగా నిలిచి ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌కుమార్, రాజ్‌కుమార్, ఉమార్‌ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, ఖాలీద్ అహ్మద్, శంకర్, ఖురేషి, శ్రీధర్, వహీద్, అబ్దుల్ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

24న సుబాన్‌పురా బస్తీ దవాఖానా ప్రారంభం



అబిడ్స్: ఈనెల 24న జాంబాగ్‌లోని సుబాన్‌పురాలో బస్తీ దవాఖానా ప్రారంభిస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మంత్రిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్థానిక ప్రజల సౌకర్యార్థం ఆనంద్‌కుమార్‌గౌడ్ విజ్ఞప్తి మేరకు ఈ బస్తీ దవాఖానా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా హిందీనగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కంటివెలుగు కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధికి మంత్రి తలసాని అండగా ఉండి ఎంతో సహకారం అందిస్తున్నారన్నారు. కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అహ్మద్, షేక్ జహంగీర్, సాజీద్ అహ్మద్ అన్సారీ, యుసఫ్, సలీం, నిజాం సాద్, సయ్యద్ అంజాద్, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలను పాటించాలి



రోడ్డు భద్రతా వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనాథ్



మణికొండలో వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రాయదుర్గం ట్రాఫిక్ సీఐ శ్రీనాథ్

మణికొండ: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించినపుడే క్షేమంగా గమ్య స్థానాలకు చేరతారని, ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని రాయదుర్గం ట్రాఫిక్ సీఐ శ్రీనాథ్ అన్నారు. మంగళవారం రాయదుర్గం ట్రాఫిక్ అధికారులు, సిబ్బందితో పాటు ఆలూ ఫిట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సిబ్బంది భాగస్వామ్యంతో 34వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా నాలెడ్జిసిటీ నుంచి టీహబ్ వరకు.. రాయదుర్గం నుంచి మణికొండ వరకు రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్న తరువాతనే వాహనాలను నడపాలని, మద్యం సేవించి వాహనాలను నడపవద్దన్నారు. హెల్మెట్, సీటు బెల్టులు ధరిస్తే ప్రమాదాలు జరిగినా స్వల్పగాయాలతో బయటపడవచ్చన్నారు. అత్యవసర సమయంలో 100కు ఫోన్ చేయాలని, స్టాప్ లైన్ దాటి వాహనం ఆపకూడదని, ట్రిపుల్ రైడింగ్‌లు వద్దని సూచించారు. కార్యక్రమంలో ఆలూఫిట్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ వసంత్ కన్నన్, సేఫ్టీ ఇంచార్జి భూమిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారు



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్

బండ్లగూడ: బంగారు తెలంగాణను కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చారని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. బండ్లగూడలోని జీఆర్‌కే గార్డెన్‌లో కార్పొరేషన్ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి అధ్యక్షతన మంగళవారం రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం తెచ్చుకున్న తెలంగాణలో డబుల్ ఇళ్లు లేవు.. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవు.. ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాజేంద్రనగర్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండి కూడా నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నేను పుట్టిన గడ్డపై నాకు అవకాశం కల్పిస్తే రాజేంద్రనగర్‌ని ఉన్నత నియోజకవర్గంగా మారుస్తానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి షాబుద్దీన్, ఏ బ్లాక్ అధ్యక్షుడు దప్పు నవీన్, బీబ్లాక్ అధ్యక్షుడు ఖలీద్, నాయకులు సంజయ్ యాదవ్, శేఖర్ యాదవ్, ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు

వెటర్నరీ ఆస్పత్రిలో సౌకర్యాలేవీ ?



సిద్దిపేట నుంచి వచ్చిన మల్లేష్ తన గోడు తెలుపుతున్న దృశ్యం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ వెటర్నరీ ఆస్పత్రిలో సరైన మందులు, నిర్వహణ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రాజేంద్రనగర్ డివిజన్ మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్ ఆరోపించారు. మంగళవారం వెటర్నరీ ఆస్పత్రి వద్ద సిద్దిపేట నుంచి వచ్చిన వారితో కలిసి విలేకరులతో మాట్లాడారు. సిద్దిపేటకు చెందిన మల్లేష్ తన పెంపుడు పిల్లిని తీసుకువచ్చారన్నారు. ఇక్కడ వైద్యం ఉచితమని వచ్చాడని, వివిధ పరీక్షలు, మందుల పేరిట రూ.13 వేల రూపాయలు ఖర్చు చేయించారన్నారు. అలాగే కరీంనగర్‌కు చెందిన లక్ష్మికి కూడా వేలాది రూపాయలు మందులకే అవుతున్నాయని చెప్పారు. ఈ విషయాన్ని రాజేంద్రనగర్ నియోజకవర్గ మజ్లిస్ పార్టీ ఇన్‌చార్జ్ రహమత్‌బేగ్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ దృష్టికి తీసుకువెళ్లి ఆందోళన చేయిస్తామని వారు పేర్కొన్నారు.

నేటి నుంచి కంటి వెలుగు శిబిరాలు

శంషాబాద్ రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమంను నిర్వహించనున్నారు. మొదటిరోజు చౌదరిగూడ, రషీద్‌గూడ గ్రామాల్లో బుధవారం ఈ కార్యక్రమం ప్రారంభించనున్నారు. ఆయా గ్రామాల్లో జనాభా ఆధారంగా 4 నుంచి 7 రోజుల వరకు శిబిరం ఏర్పాటు చేయనున్నారు. నర్కూడ, పెద్దషాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో ఈ శిబిరాల ఏర్పాటుకు డాక్టర్లు దివ్యశ్రీ, ప్రభాకర్ చర్యలు చేపట్టారు. ప్రతి ఒక్కరికీ ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేసి అవసరం ఉన్నవారికి కంటి అద్దాలు, ఆపరేషన్లు, మందులు అందజేయనున్నారు.

శాతం చెరువు.. అభివృద్ధి కరువు



అభివృద్ధికి నోచుకోని శాతం చెరువు

గోల్కొండ: అధికారుల ఉదాసీన వైఖరికి గోల్కొండ కోట నయాఖిలాలోని శాతం చెరువు నిదర్శనంగా నిలిచింది. పదేళ్లుగా ఈ చెరువును అధికారులు అభివృద్ధి చేస్తామంటూ హామీలు ఇస్తున్నారు. బల్దియా కమిషనర్‌లు ఎందరో ఇప్పటి వరకు ఈ చెరువును సందర్శించే వెళ్లారే తప్పా సుందరీకరణకు మాత్రం చర్యలు తూతూ మంత్రంగా తీసుకుంటున్నారు. కాగా ఈ చెరువు కట్టను ఆనుకుని మార్నింగ్ వాకర్స్ కోసం దారిని కూడా ఏర్పాటు చేసి దానికి ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు. అయితే చెరువు కట్ట పొడవునా టన్నుల కొద్ది వ్యర్థాల డంపింగ్ కారణంగా వేసిన కంచె పూర్తిగా ధ్వంసమైంది. మరోవైపు ఎన్నో మార్లు చెరువులో పూడికతీత పనులు చేపట్టారు. షరా మామూలే అన్నట్లు పూడికతీసిన కొన్ని రోజుల్లోనే మళ్లీ గుర్రపు డెక్క చెరువులో వ్యాపిస్తుండేది. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ గత సంవత్సరం చెరువు అభివృద్ధిపై అధికారులను నిలదీయడమే కాకుండా బల్దియా కమిషనర్‌తోపాటు ఇతర శాఖల అధికారులను చెరువు దగ్గరకు రప్పించి, చెరువు దుస్థితిని అధికారులకు వివరించారు. అయితే అధికారులు మాత్రం చెరువులోని గుర్రపు డెక్కను తొలగించి ఊరకుండిపోయారు. ఈ చెరువును అభివృద్ధి చేసిచుట్టూ గ్రీనరీని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

సినిమాకు వెళ్లి వచ్చే సరికి ..

మైలార్‌దేవ్‌పల్లి: సంక్రాంతి పండగ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఎగ్జిబిషన్‌కు వెళ్లి సినిమా చూసి వచ్చే వరకు ఇంట్లో దొంగలు పడి నగదుతో పాటు నగలు దోచుకెళ్లిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మిగూడలో తిరుమలేష్ కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు నాంపల్లి ఎగ్జిబిషన్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అత్తాపూర్‌లో థియేటర్‌లో సినిమా చూసిరాత్రి 12 గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్నారు. గేటు తాళం పగిలి ఉండడంతో అనుమానం వచ్చిన తిరుమలేష్ ఇంట్లోకి వెళ్లి బీరువా తెరిచి చూడగా మూడున్నర తులాల బంగారంతో పాటు వెండి ఆభరణాలు, రూ. 1.50 లక్షల నగదు కనిపించలేదు. ఈ మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్

మణికొండ: నార్సింగి రక్తమైసమ్మ దేవాలయం సమీపంలో ఈనెల 5వ తేదీన దారి దోపిడీ కేసులో కరణ్‌సింగ్‌తో పాటు దాడిలో పాల్గొన్న సిద్దార్థ్(చింటూ)ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నార్సింగి ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు. అతనిపై రాజేంద్రనగర్, చందానగర్ పోలీస్‌స్టేషన్‌లలో ఐదు కేసులు ఉన్నాయన్నారు. అతని వద్ద ఓ కత్తి, రూ. 2వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

యువతి అదృశ్యం

శంషాబాద్ : యువతి అదృశ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ దేవ్‌రాజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని వెళాంకనీ కాలనీలో నివాసముండే సీఐఎస్ఎఫ్ ఉద్యోగి అమర్‌నాథ్ పన్నెండేళ్లుగా కె. దివ్య (18) దత్తత తీసుకున్నాడు. ఈ నెల 15వ తేదీ ఇంట్లో ఎవరికి చెప్పకుండా దివ్య బయటికి వెళ్లింది. తిరిగి రాలేదు. అన్ని చోట్లా వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దివ్య మానసిక పరిస్థితి సరిగా లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..



బాషుమియా(ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు కనిపించకుండా పోయిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మశాలిపురం ప్రాంతానికి చెందిన భాషుమియా(75) తన కుమారుడి కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 14వ తేదీన ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులు ఫిర్యాదు చేశారు. కాగా భాషుమియాకు మతిస్థిమితం లేదని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడు మృతి



మైలార్‌దేవ్‌పల్లి: స్థానికంగా భిక్షాటన చేసే వృద్ధుడు మృతి చెందాడు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మిగూడ మెహిఫిల్ హోటల్ ప్రాంతంలో స్థానికంగా భిక్షాటన చేసే వృద్ధుడు(70) పడి ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. స్థానికంగా భిక్షాటన చేస్తూ రోడ్డుపై జీవిస్తుంటాడని స్థానికులు వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.